సాక్షి
కుమురం భీం

ఆదివారం : 21 : జూలై : 2024



స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

ఇటీవల విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు శ్రీకారం చుట్టారు. 9లో▸



ఎస్పీకి సన్మానం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డీవీ శ్రీనివాస్‌రావ్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ శాలువాతో సత్కరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

జిల్లా వ్యాప్తంగా వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు వీస్తాయి. గాలిలో తేమశాతం పెరుగనుంది.

న్యూస్‌రీల్

ఉద్యోగ మేళాకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్అర్బన్: నిరుద్యోగ యువతీ, యువకులకు జీఎంఆర్ సహకారంతో నిర్వహించనున్న ఉద్యోగ మేళాకు ఆసక్తి గల అభ్యర్థులు జిల్లాలోని సంబంధిత పోలీసు స్టేషన్‌లలో దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావ్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. జీఎంఆర్ కంపెనీకి సంబంధించిన వివిధ ప్రదేశాల్లో సెక్యూరిటీగార్డు ఉద్యోగాలు వెయ్యి వరకు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.15వేలు, హైదరాబాద్ టీసీఎస్ ఆదిబట్లలో రూ.17వేలు, హైదరాబాద్‌లోని సినర్జి కంపనీలో రూ.17వేలు, మైలన్ యూనిట్‌లో రూ.15వేలు, బెంగళూర్ బాష్ కంపనీలో రూ.21వేలు, ఒడిశాలోని జేడీపీఎల్‌లో రూ.18వేల వేతనంతో పాటు వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పురుషులు ఎత్తు 167 సెం.మీ, మహిళలు 154 సెం.మీ ఉండాలన్నారు. ఆసక్తి కలవారు పదో తరగతి సర్టిఫికెట్ అందజేసి తమపేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌కు ఒక తేదీని నిర్ణయించి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కోతకు గురైన అందవెల్లి వంతెన



అందవెల్లి వంతెన వద్ద నిలిచిన ఆటోలు

దహెగాం: కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై పూర్తయిన వంతెన అప్రోచ్ రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురి కావడంతో ఆటోలు, కార్లకు అనుమతి నిరాకరిస్తున్నారు. శనివారం కాగజ్‌నగర్‌కు అవసరం నిమిత్తం వెళ్లినవారు అనుమతి నిరాకరించడంతో వెనుదిరిగారు. వంతెన పైనుంచి భారీ వాహనాలు వెళ్లకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అప్రోచ్ రోడ్డు కోతకు గురికావడంతో కాగజ్‌నగర్, భీమిని, దహెగాం మండలాల్లోని సుమారు 50 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే పెంచికల్‌పేట్ మీదుగా 65 కిలో మీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతీ సోమవారం 'విద్యుత్ ప్రజావాణి'

ఆసిఫాబాద్అర్బన్: విద్యుత్ వినియోగదారుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వాసుదేవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ ఆఫీస్, డివిజన్ కార్యాలయం, ఈఆర్‌వో, సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సర్కిల్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

ఆసిఫాబాద్అర్బన్: ప్రభుత్వం చేపడుతున్న మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత అందించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించి మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మహిళలకు క్యాంటీన్‌తో పాటు స్త్రీనిధి లింకేజీ, బ్యాంకు లింకేజీ, వాటర్ షెడ్‌ల ద్వారా నిధులు సమకూర్చి రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఏ రామకృష్ణ, తహసీల్దార్ తిరుపతి, ఏపీఎం సుజాత, శ్రీనివాస్, ఎంపీవో శివకుమార్, మండల సమాఖ్య సీసీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని డీఈవో అశోక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ హరిత్‌దళం ఆధ్వర్యంలో ఎల్ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీకి ఎంపికైన విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ విద్యుత్ కొరతను అధిగమించడానికి పొదుపుగా వినియోగించుకోవాలన్నారు. ఎల్ఈడీ లైట్ల వాడటంతో విద్యుత్ పొదుపు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని 43 ఉన్నత పాఠశాలల నుంచి 170 మంది విద్యార్థులకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. జాతీయ హరిత్‌దళం రీజనల్ కోఆర్డినేటర్ విద్యాసాగర్, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, హెచ్ఎం సుభాష్ పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వాన

- ఉప్పొంగిన వాగులు, ఒర్రెలు
- వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ
- కుమురంభీం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



దహెగాం: వరద నీటిలో మునిగిన పత్తి చేను

ఆసిఫాబాద్: పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురియడంతో జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లాలోని వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎగువన కురిసిన వర్షంతో జిల్లాలోని ప్రాజెక్టుల్లో వరద నీరు చేరి జలాశయాలు, చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపించాయి. జిల్లా కేంద్రంలోని పెద్దవాగులో ఎగువ నుంచి వస్తున్న వర్షపు నీటితో నీటి ప్రవాహం పెరిగిపోయింది. మరో రెండు రోజులు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి ఒర్రె వద్ద వరద ఉధృతిని పరిశీలించి ముందు జాగ్రత్తగా సిబ్బందికి సూచనలిచ్చారు. కెరమెరి మండలంలోని సాంగ్వి వాగును అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లాలోని ప్రమాదకరమైన కల్వర్టులు, బ్రిడ్జిల వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి అటువైపు ప్రజలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు.

ప్రజల రక్షణకు ప్రత్యేక చర్యలు

జిల్లాలో వరద పరిస్థితుల దృష్ట్యా ప్రజల రక్షణ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. ఎడతెరిపి వర్షాలతో నదులు, వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, పోలీస్, రెవెన్యూ, పంచాయతి అధికారులు సమన్వయంతో భద్రతా, బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. వరదల వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే గ్రామాల్లో గర్భిణులను గుర్తించి సమీప పీహెచ్‌సీల్లో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తమ పరిధిలోని ఇళ్లను సందర్శించి, జాగ్రత్తలు సూచించాలన్నారు. ప్రజల సహాయార్థం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరద పరిస్థితుల్లో సహాయం కోసం 08733-279033, 6304686505 నంబర్లలో సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లోకేశ్వర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.

కుమురంభీం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తివేత

ఎగువన కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని కుమురంభీమ్, వట్టివాగు ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు చేరింది. ఈ క్రమంలో ప్రాజెక్టు అధికారులు కొమురంభీమ్ ప్రాజెక్టు 4 గేట్లు ఎత్తి వేశారు. ఇన్‌ఫ్లో 1778 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 1941 క్యూసెక్కులు ఉంది. ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 243 మీటర్లు కాగా 237.850 మీటర్లకు చేరింది. వట్టివాగు ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 239.500 మీటర్లు కాగా 234.350 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 100 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లో 90 క్యూసెక్కులు ఉంది. జిల్లాలో శనివారం 19.6 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సిర్పూర్(యూ)లో 40.2 మిల్లీ మీటర్లు నమోదైంది. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలో 8.8 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది.

అడ ప్రాజెక్టును సందర్శించిన ఎస్పీ



ప్రాజెక్టు వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఉప్పొంగుతున్న వాగులు, బ్రిడ్జిల వద్ద పోలీస్ బార్కెట్స్, పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో ఇరిగేషన్ ఈఈ గుణవంత్‌రావుతో కలిసి ఆసిఫాబాద్ మండలం కొమురంభీమ్ ప్రాజెక్టును సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్తగా ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని సూచించారు. పిల్లలు, యువకులు జలాశయాల వద్దకు వెళ్లవద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ సదయ్య, సీఐ సతీశ్, సిబ్బంది ఉన్నారు.

నీట మునిగిన పత్తిపంటలు



దహెగాం: రోడ్‌డ్యాంపై నుంచి పారుతున్న వరదతో నిలిచిన వాహనాలు

దహెగాం: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఐనం గ్రామ సమీపంలో ఉన్న రెండు రోడ్‌డ్యాంలపై నుంచి వరద పారడంతో రాకపోకలు స్తంభించాయి. పంచాయతీ అధికారులు రోడ్ డ్యాం దాటకుండా ట్రాక్టర్ అడ్డుగా పెట్టారు. పెసరికుంట, బీబ్రా, కోత్మీర్ గ్రామాల నుంచి దహెగాంలోని పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు రోడ్ డ్యాం వద్దే ఆగిపోవడంతో తల్లిదండ్రులు వచ్చి పిల్లలను తీసుకెళ్లారు. పత్తి చేలలో మొక్కలు నీట మునిగాయి.

జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం(మి.మీ)
జైనూర్	6.6
సిర్పూర్(యూ)	40.2
తిర్యాణి	10.4
రెబ్బెన	14.0
ఆసిఫాబాద్	12.6
కెరమెరి	13.6
వాంకిడి	20.2
కాగజ్‌నగర్	14.8
సిర్పూర్(టి)	25.6
కౌటాల	29.8
బెజ్జూర్	33.2
దహెగాం	15.2
లింగాపూర్	18.8
చింతలమానెపల్లి	27.8



ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి ఒర్రె వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



బెజ్జూర్ మండలం కృష్ణపెల్లి-సుశ్మీర్ రోడ్డు వద్ద బందోబస్తు



అందవెల్లి బ్రిడ్జి వద్ద పోలీసుల బందోబస్తు



రణవెల్లి సమీపంలో లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

జల దిగ్బంధంలో గ్రామాలు

చింతలమానెపల్లి: ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మండలంలోని దిందా, దరంపెల్లి, నాయకపుగూడ, శివపెల్లి గ్రామాలు జలదిగ్బంధం కాగా బూరెపల్లి, రణవెల్లి గ్రామాలకు రవాణా నిలిచి పోయింది. గూడెం వద్ద ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నాగుల్వాయి వాగు ఉధృతితో డబ్బా గ్రామ పంచాయతీలోని బారెగూడ, రుద్రాపూర్, హేటిగూడ, బాబాసాగర్, గ్రామాలు వరదతాకిడికి గురయ్యాయి. బాలాజీ అనుకోడ-పాల్వాయినగర్ గ్రామాల మధ్యన లోలెవల్ వంతెనపై నుండి వరద ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. రవీంద్రనగర్, రుద్రాపూర్, గూడెం, గంగాపూర్, బారెగూడ గ్రామాల్లో వరదనీరు ఇళ్లలోకి చేరింది.



మత్తడి నుంచి ప్రవహిస్తున్న అర్కగూడ ప్రాజెక్టు నీరు



మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్ ఇన్

కాగజ్‌నగర్ రూరల్: అంశం: పారిశుధ్య నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు

అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్
సమయం: సోమవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు

6300688040

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల బాలికల వసతిగృహాన్ని తనిఖీ చేశారు. సౌకర్యాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులకు సరిపడా స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సంక్షేమ అధికారిని ఆదేశించారు. హాస్టల్ పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు. తాజా కూరగాయలతో ఆహారం అందించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్అర్బన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. శనివారం జైనూర్ పీహెచ్‌సీని డీఎంహెచ్‌వోతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వార్డులు, ఫార్మసీ, పరిసరాలు పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందులు, పరీక్ష కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. గర్భిణులకు ప్రసవ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే ఆస్పత్రిలో చేర్చుకోవాలన్నారు. అంతకుముందు ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీహెచ్ చెన్నకేశవులు, వైద్యులు అశోక్, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

పనులు సరే.. పైసలేవి?

- రెండున్నర నెలలుగా అందని ఉపాధి హామీ వేతనాలు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు
- జిల్లాలో రూ.26 కోట్లకు పైగా పెండింగ్



రెబ్బెన మండలం గోలేటిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

తిర్యాణి: దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారికి ఉపాధి కల్పించాలన్న సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హమి పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికి వందరోజుల పనిదినాలు కల్పిస్తున్నారు. పథకం ప్రారంభంలో కూలీలకు ఎంతగానో ఉపయోగకరంగా రానురాను సమయానికి వేతనాలు విడుదల చేయకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో 1.23 లక్షల జాబ్‌కార్డులు ఉండగా అందులో 2.47 లక్షల మంది కూలీలు సభ్యత్వం కలిగి ఉన్నారు.

అందని వేతనాలు

ఉపాధి హామీ పథకంలోని చట్టం ప్రకారం కూలీలు పనిచేసిన 21 రోజుల్లోనే వేతనాలు అందించాలి. కానీ దాదాపు 10 వారాలు కావస్తున్నా చేసిన పనులకు సంబంధించిన వేతనాలు అందడం లేదు. జిల్లాలో దాదాపు ఇప్పటి వరకు రూ.26 కోట్లకు పైగా కూలీలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి కనబరిచారు. దీనికి తోడు ఈ ఏడాది పార్లమెంట్ ఎన్నికలు జరిగిన సమయం వరకు కూలీలకు సంబంధించిన వేతనాలు మూడు, నాలుగు రోజుల్లోనే కూలీల ఖాతాల్లో సక్రమంగా జమ అవుతుండటంతో గతంతో పోలిస్తే ఈ ఏడాది కూలీల సంఖ్య కొంతమేర పెరిగింది. అయితే రెండున్నర నెలలుగా వేతనాల చెల్లింపులు పూర్తిగా నిలిచిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు వాపోతున్నారు. జిల్లాలో ఎక్కువగా కూలీలకు సంబంధించి పోస్టాఫీస్ ఖాతాలోనే వేతనాలు జమ అవుతుంటాయి. దీంతో తమ డబ్బులు వచ్చాయో లేదోనని ఉపాధి హామీ కూలీలు నిత్యం పోస్టాఫీసుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

డబ్బులకు బదులు బియ్యం ఇస్తారని ప్రచారం...

దేశంలో బియ్యం నిల్వలు అధికంగా పేరుకుపోయాయని, ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేపట్టిన కూలీలకు డబ్బులకు బదులు బియ్యం పంపిణీ చేస్తారనే ప్రచారం కొన్ని రోజులుగా జోరుగా సాగుతోంది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికరంగా ఎలాంటి అదేశాలు రాలేదు. బియ్యం పంపిణీ కోసమే వేతనాలు విడుదల చేయడం లేదనే ఆందోళనలో కూలీలు ఉన్నారు. పెండింగ్ వేతనాలు వీలైనంత త్వరగా విడుదల చేయాలని ఉపాధి హామీ కూలీలు కోరుతున్నారు.

ఏడు వారాల పైసలు రావాలె



నాకు ఏడు వారాల పైసలు రావాలె. ప్రతిసారి పోస్టాఫీసు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. దీంతో ఖాతాలో డబ్బులు పడ్డాయో లేదోనని వారానికి రెండు సార్లు పోస్టాఫీసు చుట్టూ తిరుగుతున్నా.

– మహదేవుని విజయ, ఉపాధి కూలీ, గోలేటి

వేతనాలు ఇవ్వాలి



ఉపాధి హామి పనులకు సంబంధించిన రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. పనికి వెళ్లినా డబ్బులు రాకపోవడంతో చాలా కష్టమవుతోంది. ఉపాధి హామీ సిబ్బందిని అడిగితే సరైన సమాధానం ఇవ్వడంలేదు. – దుర్శెట్టి సతీశ్, తిర్యాణి

నివేదికలు అందజేశాం

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన వేతనాల కోసం ప్రభుత్వానికి నివేదించాం. మే 22 వరకు వేతనాలు వచ్చాయి. దాదాపు రెండు నెలలకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే కూలీల ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది.

– సురేందర్, డీఆర్‌డీవో

క్లుప్తంగా

తప్పిపోయిన బాలుడి అప్పగింత



కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు మంచిర్యాల పోలీసులు అప్పగించారు. సీఐ బన్సిలాల్ కథనం ప్రకారం.. శనివారం స్థానిక రైల్వేస్టేషన్ ప్రాంతంలో పెట్రోలింగ్ చేస్తున్న బ్లూకోల్ట్స్ పోలీసులకు దివ్యాంగ బాలుడు రోదిస్తూ కనిపించాడు. అతన్ని విచారించగా చెన్నూర్ మండలం ఎర్రగుంటపల్లె గ్రామానికి చెందిన పందిళ్ల మహేశ్–సునీత దంపతుల కుమారుడు రాజేశ్ (10) అని తెలిసింది. వెంటనే కుటుంబీకులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారి కోరిక మేరకు బంధువు అయిన శ్యామలకు అప్పగించినట్లు తెలిపారు. బాలుడి ఆచూకీ తెలుసుకుని అప్పగించడంలో కీలకంగా వ్యవహరించిన ఏఎస్సై దివాకర్, రమేశ్‌లను డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

అటవీ అధికారుల బదిలీ



హఫీజొద్దీన్

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి హఫీజొద్దీన్ లక్సెట్టిపేట రేంజ్ అధికారిగా బదిలీ అయ్యారు. కాగా, ఖమ్మం అటవీ డివిజన్ తొర్రూర్ రేంజ్ అధికారి జి.మంగిలాల్ ఇందన్‌పల్లికి, తాళ్లపేట్ డిప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్ నీల్వాయి డీఆర్వోగా, టింబర్ డిపో డీఆర్వో హైమావతి కాగజ్‌నగర్ డివిజన్ ఖర్జెల్లికి, లక్సెట్టిపేట రేంజ్ పెద్దంపేట డీఆర్వో హేమలత కవ్వాల్ డీఆర్వోగా బదిలీయ్యారు. అదేవిధంగా భర్తన్‌పేట్ సెక్షన్ అధికారి శివకుమార్ దొంగపల్లి సెక్షన్‌కు, చింతగూడ సెక్షన్ అధికారి స్రవంతి కెరమెరి రేంజ్ సాంగ్రి సెక్షన్‌కు బదిలీ అయ్యారు.

108లో ప్రసవం



శిశువు, మహిళతో సిబ్బంది

లక్సెట్టిపేట: మండలంలోని పోచంపల్లికి చెందిన గర్భిణి విజయ పురిటినొప్పులతో బాధపడుతుంది. శనివారం ఆమె కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేసి సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని ఆమెను మంచిర్యాల మాతాశిశు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికమయ్యాయి. వాహనం ఆపి ప్రసవం చేసినట్లు ఈఎంటీ పేరం అనిల్, పైలట్ గంగన్న తెలిపారు. రెండో కాన్పులో మగబిడ్డ జన్మించాడు. తల్లీబిడ్డను ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు.

ఉరేసుకొని ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అడ్డగుట్టకు చెందిన మడావి సాయి (23) ఉరేసుకొని శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై జాహిరొద్దీన్ కథనం ప్రకారం.. సాయి వ్యవసాయ కూలీగా చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్నినెలలుగా ఛాతీనొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా నయంకాలేదు. దీంతో మనస్తాపంతో ఇంట్లో ఉరేసుకున్నాడు. తండ్రి రాజు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సర్కారు బడులపై దృష్టి!



మంచిర్యాల జెడ్పీ బాలుర పాఠశాలలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న కలెక్టర్

- ఓ వైపు కలెక్టర్..మరోవైపు డీఈవో ఆకస్మిక తనిఖీ
- సమయపాలన పాటించని టీచర్లలో గుబులు

మంచిర్యాలఅర్బన్: రాష్ట్రప్రభుత్వం సర్కారు బడులపై ప్రత్యేక దృష్టి సారించింది. మౌలిక వసతులు, భోజనం, నాణ్యమైన విద్య, విద్యార్థుల అభ్యసనపై ఆరా తీస్తున్నారు. కలెక్టర్, డీఈవో ఆకస్మిక తనిఖీలతో గైర్హాజరు, సమయపాలన పాటించని టీచర్లలో గుబులు రేపుతోంది. బయోమెట్రిక్ అమల్లో లేక చాలామంది సమయపాలన పాటించడం లేదని తెలుస్తోంది. విద్యార్థులు వచ్చినా టీచర్లు లేక బడి ఆలస్యంగా తెరుస్తున్నారనే అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో పాఠశాలల తనిఖీలు చేపట్టారు. ఇటీవల నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రార్థన సమయానికి హాజరుకాని టీచర్లకు నోటీసులు జారీ చేయగా..మరో పాఠశాలలో అనుమతి లేకుండా గైర్హాజరు అయిన అటెండర్‌పై చర్యలకు ఉపక్రమించారు. కలెక్టర్ కుమార్‌దీపక్, డీఈవో యాదయ్య జిల్లాలో వేర్వేరుగా పాఠశాలల ఆకస్మిక తనిఖీలు చర్చనీయాంశంగా మారింది. ఎప్పుడు ఏ పాఠశాలలో..ఎక్కడ ఉంటారో? తెలియకపోవడంతో అనుకున్న సమయాని కంటే టీచర్లు బడిబాట పట్టాల్సిన పరిస్థితి.

లెక్కలు చేయించి..తెలుగు చదివించి

మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ కుమార్‌దీపక్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి గదికి వెళ్లి గణితం (లెక్కలు) ఎంత మేర అర్థమవుతున్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. బ్లాక్‌బోర్డుపై విద్యార్థులతో గుణాకారం లెక్కలు (గణితం) వేయించారు. ఆరో తరగతికి వెళ్లి తెలుగులో చదివించారు. విద్యార్థులతో డాయగ్రామ్ వేయించారు. 45 నిమిషాలు క్లాస్‌రూంలు కలియతిరుగుతూ వారి అభ్యసన సామర్థ్యాలు, వసతి సౌకర్యాలను పరిశీలించారు. చదువుల్లో వెనకబడిన వారిపై చొరవ తీసుకోవాలని టీచర్లకు సూచించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరుపై అడిగి తెలుసుకున్నారు. హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. పాఠశాలలో చేపట్టిన పనులు, తరగతి గదులు, పైకప్పులు పరిశీలించారు. టాయిలెట్స్ పనులు త్వరిగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యాబోధనతోపాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఇదివరకు లక్సెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్, కోటపల్లి మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల వసతులు, టీచర్లు, విద్యార్థుల హాజరు, మెనూ అమలు తదితర విషయాలపై ఆరా తీశారు.

ప్రైమరీ పాఠశాల తనిఖీ

జిల్లాకేంద్రంలో ఒకే ప్రాంగణంలో నిర్వహిస్తున్న బైపాస్‌రోడ్ హరిజనవాడ, రాళ్లపేట్ పాఠశాలలను డీఈవో యాదయ్య గురువారం ఆకస్మిక తనఖీ చేశారు. విద్యారుల ప్రవేశాలు, హాజరైన సంఖ్యపై ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పనులను పరిశీలించారు. త్వరగతిన నల్లాలకు ట్యాప్‌లు బిగించాలని సూచించారు. వాటర్ సంపుపై సిమెంట్ దిమ్మె ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రెగ్యులర్ టీచర్ వచ్చే వరకు పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించనున్నట్లు డీఈవో 'సాక్షి'కి తెలిపారు. అంతకుముందు క్యాతన్‌పల్లి, సీతారాంపల్లి తదితర పాఠశాలలను పరిశీలించారు. సింగల్ టీచర్ ఉన్నా పాఠశాలలో ప్రత్నామయంగా పీటీఐలకు బాధ్యతలు అప్పగించారు.

సారూ..జర చూడరూ

జిల్లాలో సోషల్ వెల్ఫేర్, ట్రైబల్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, టీఎస్ టీడబ్ల్యూ ఆర్ఈఐ సొసైటీ స్కూల్ 36 ఉన్నాయి. ఎస్సీ వసతి గృహాలు 23, బీసీ ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ వసతిగృహాలున్నాయి. చాలా చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లు మూలనపడ్డాయి. మరుగుదొడ్లు కంపుకొడుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనంలో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. సరిపడా స్నానపు గదులు లేక ఇబ్బందులున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఉద్యోగుల ఇష్టారీతిన సాగుతుంది. సమస్యల పరిష్కారంతోపాటు మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ రాత్రి అందించే భోజనం అమలు సక్రమంగా సాగాలంటే అధికారులు జర చూడాల్సిందే.

అధిక తేమతో పంటలకు చేటు



పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

- జాగ్రత్తలు పాటిస్తే మేలు



సంకె శ్రీనివాస్, ఏవో, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట చేలల్లో నీరు నిలుస్తుంది. నీరు ఎక్కువైతే తేమతో పంటలకు నష్టం వాటిల్లనుంది. అధిక తేమతో పంటలు నష్టపోకుండా ఉండాలంటే జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో సంకె శ్రీనివాస్ పలు సూచనలు, సలహాలు అందజేశారు. వర్షాలకు పత్తి చేనులో నీరు నిలిస్తే వెంటనే చేనులో నీరు నిల్వకుండా కాలువలు తీసి చేనులో ఉన్న నీటిని బయటకు పంపించాలి. వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమ తగ్గించుకోవడానికి అంతర సేద్యం చేయాలి. వర్షాలు తగ్గాక బురద పదనులో ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులు వేసుకోవాలి. అలాగే ఎకరాకు సీఓసీ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఒక రోజు తర్వాత స్వర్ణపాల్‌ను కిలో తీసుకొని 150 లీటర్ల నీటికి కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలి. వేరుకుల్లు తెగులు ఆశిస్తే 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో తడపాలి. మొక్కజొన్న పంట అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేసుకోవాలి. ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును మొక్కల మొదళ్ల వద్ద వేసుకోవాలి. కాండం తొలిచే పురుగు ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోలు ఆకుసుడుల్లో వేయాలి. పెసర, మినుము పైర్లకు అధిక తేమతో పేనుబంక, లద్దె పురుగు ఆశించే అవకాశం ఉంది. ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మిరప పంటలో నీరు నిలిస్తే వెంటనే నీటిని కాలువల ద్వారా తొలగించాలి. నారుకుళ్లు తెగులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా 2 గ్రాముల రిడోమిల్ లీటరు నీటికి కలిపి వారంలో రెండు, మూడుసార్లు పిచికారి చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక తేమ నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ సామగ్రి చోరీ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సై

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని తక్కళ్లపల్లి శివారులో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ నిర్మాణ కోసం సిద్ధంగా ఉంచిన సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బీఎస్ఎన్ఎల్ సంస్థ ఈనెల 9న రూ.8.84 లక్షల విలువైన 10.129 టన్నుల సామగ్రిని సెల్‌టవర్ నిర్మాణ స్థలం వద్ద నిల్వ చేశారు. ప్రతీరోజు సంబంధిత వ్యక్తులు సామగ్రిని పరిశీలిస్తూ వెళ్తున్నారు. శనివారం ఉదయం రాగా 7.3 టన్నుల సామగ్రి చోరీకి గురైందని ఏరియా మేనేజర్ షేక్ అబ్దుల్ ఖాదర్ ఫిర్యాదు చేశారు. ఎస్సైతో కలిసి రెబ్బెన సీఐ చిట్టిబాబు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొడుకుకు తలకొరివి పెట్టిన తల్లి



అంత్యక్రియలకు వెళ్తున్న తల్లి పోశక్క

నెన్నెల: ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్యకు పాల్పడగా, అంత్యక్రియల్లో తల్లి కొరివి పెట్టింది. మండలంలోని గన్‌పూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన పోలంపల్లి మల్లేశ్ (28) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ యువకుడి తండ్రి చిన్నతనంలో చనిపోగా మృతుడు మల్లేశ్ భార్య గొడవపడి పుట్టింట్లో ఉంటుంది. వీరికి పిల్లలు లేరు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో ఆ తల్లి గుండెను రాయిచేసుకొని కొరివిపెట్టింది. తాను చనిపోతే కొరివి పెట్టాల్సిన కొడుకుకి తానే చితి పెట్టానని ఆ తల్లి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

- ఒకరు మృతి



రాజేందర్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని గూడెం సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం..కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మడిపల్లికి చెందిన వొల్లాల రాజేందర్ (39) శుక్రవారం రాత్రి బైక్‌పై లక్సెట్టిపేట నుంచి గూడెం వైపు వెళ్తున్నాడు. గూడెం సమీపంలో అదేగ్రామానికి చెందిన అక్షయ్ బైక్‌ను రాంగ్ రూట్లో అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి రాజేందర్ బైక్‌ను ఎదురుగా ఢీకొట్టాడు. రాజేందర్ తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య శారద ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేడు కడెం ఆయకట్టుకు నీటి విడుదల



మాట్లాడుతున్న నాయకులు

కడెం/దండేపల్లి: కడెం ప్రాజెక్ట్ ఆయకట్టు కాలువలకు ఆదివారం సాగునీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ ఈఈ విఠల్ పేర్కొన్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టం 690 అడుగులు దాటడంతో కుడి, ఎడమ కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సాగునీటి విడుదలకు ఖానాపూర్, మంచిర్యాల ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, కొక్కిరాల ప్రేంసాగర్‌రావు రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్ శనివారం తెలిపారు.

కేజీబీవీలో భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

కోటపల్లి: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యుత్, నీటి సమస్యలతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. మూడు రోజులుగా నీళ్ల లేకపోవడంతో కొందరు వర్షపు నీటితో స్నానాలు చేశారు. శనివారం పాఠశాలకు వచ్చిన స్పెషల్ ఆఫీసర్ వినోద్‌కుమార్ భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులు ఆయన్ను కలవకుండా ఎస్‌వో జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, పాఠశాలలో నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని ఎస్‌వో హరిత తెలిపారు.

రైల్వేస్టేషన్లలో విస్తృత తనిఖీలు



పోలీసు జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

బెల్లంపల్లి/మంచిర్యాలక్రైం: గంజాయి, మత్తుపదార్థాల నియంత్రణలో భాగంగా బెల్లంపల్లి, మంచిర్యాల రైల్వేస్టేషన్లలో ఏసీపీ ప్రకాశ్ ఆధ్వర్యంలో శనివారం విస్తృత తనిఖీలు చేశారు. పోలీసు అధికారులు, సిబ్బంది నార్కొటిక్ ట్రైనింగ్ స్నిఫర్ డాగ్‌తో రైల్వేస్టేషన్ పరిసరాలు, పార్సిల్ సర్వీస్ కేంద్రాలు, అనుమానస్పద వస్తువులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చి ఆగిన రైళ్లలో ఎక్కి ప్రయాణిలను తనిఖీ చేశారు. బ్యాగులను సోదాలు చేశారు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్ ముందున్న హోటళ్లను తనిఖీ చేశారు. తనిఖీలతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ ప్రకాశ్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి తాగిన, అమ్మిన చర్యలు ఉంటాయన్నారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై డి.రమేశ్, తాళ్లగురిజాల ఎస్సై జి.నరేశ్‌కుమార్, సీఐ బన్సిలాల్, నార్కొటిక్ ప్రత్యేక టీమ్, ఎస్సైలు, రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్, జీఆర్పీ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

భీమిని: పిల్లల లేరని, జీవితంపై విరక్తితో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కన్నెపల్లి ఎస్సై గంగారాం కథనం ప్రకారం.. కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన గట్టు రాజయ్య(50), భార్య దంపతులు. వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. పెళ్లయి 30 ఏళ్లయినా పిల్లలు లేరని రాజయ్య మదనపడేవాడు. ఈక్రమంలో ఈనెల 18న సాయంత్రం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. రాత్రి తెలిసిన వారి బర్త్‌డే ఉందని వెళ్లి తిరిగిరాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరకలేదు. కొత్తపల్లిశివారు నీలగిరి తోటలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం పశువుల కాపర్లు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదుతో ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురి రిమాండ్

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన బోళ్ల వ్యాపారి ప్రతాప్ ఈనెల 17న ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని శనివారం రిమాండ్‌కు తరలించారు. ప్రతాప్ ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్‌లో ముగ్గురి పేర్లు రాశాడు. ఇందులో పట్టణానికి చెందిన మహ్మద్ కలీం, ఇటిక్యాలకు చెందిన పెట్టెం తిరుపతిస్వామి, గంపలపల్లికి చెందిన జగ్గన్నపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



మొక్కలు నాటుతున్న డీఈవో, ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా రాణించాలని డీఈవో ఎస్.యాదయ్య అన్నారు. మండలంలోని దొనబండలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పేరెంట్, టీచర్స్ అసోసియేషన్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల కోసం రీడింగ్ కార్నర్స్ ఏర్పాటు చేసేలా చూడాలని పోషకులకు సూచించారు. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన, సిలబస్ వివరాలు, ఇతర కార్యకలాపాల గురించి తెలుసుకున్నారు. వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో వర్షంలోనే తడుస్తూ పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం హన్మాండ్లు, ఎస్ఓ కమ్మ చౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిన్నింగ్‌మిల్లు పనులు అడ్డగింత



ట్రాక్టర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

తాండూర్: మండలంలోని పెగడపల్లి గ్రామ సమీపంలో నిర్మాణం చేస్తున్న జిన్నింగ్‌మిల్లు పనులను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన నివాసాలకు సమీపంలో జిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. మిల్లు వల్ల దుమ్ము, చెత్త ఇళ్లపై పడే అవకాశాలు ఉన్నాయన్నారు. తద్వారా ప్రజా రోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో మిల్లు నిర్మాణం చేయొద్దని యాజమానులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అనంతరం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు గడ్డం కిష్టయ్య, బెడ్డల గణేశ్, రాజు, రాజేష్ నాగరాజు, గోపాల్, మహేశ్, విజయలక్ష్మి, భీమక్క, సత్తమ్మ, మల్లీశ్వరి, రైతులు పాల్గొన్నారు.

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం



ఐకే–ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. క్వారీలో మైనింగ్ ఆపరేషన్స్ నిలిపివేశారు. దీంతో మూడు రోజులకుగాను 15 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. ఓబీ కూడా పూర్తిగా నిలిచిపోయింది. సుమారు రెండున్నర లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికితీత పనులు ఆగిపోయాయి. వర్షంతో క్వారీలో చేరుతున్న నీటిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భారీపంపులు పెట్టి నీటిని బయటికి తోడేస్తున్నారు. వాహనాలను సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు గని మేనేజర్ బ్రహ్మాజీ తెలిపారు.

ఓసీపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

జైపూర్: మండల వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఐకే–ఓసీపీలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షపు నీరు వచ్చి చేరడంతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. ఒక్క రోజుకు 2 వేల టన్నుల చొప్పున మూడు రోజులుగా సుమారు 6వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి నష్టం వాటిల్లింది.

ప్రభుత్వ ఎస్సీ కమ్యూనిటీ హాల్ తాకట్టు


- రూ.3లక్షల అభివృద్ధి పనులకు అప్పగింత
- మూడేళ్లపాటు రుణదాతకు నిర్వహణ బాధ్యతలు
- ఒప్పందంపై దళిత సంఘాల వ్యతిరేకత



ఎస్సీ కమ్యూనిటీ హాల్ భవనం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. సౌకర్యాల కల్పన కోసమని ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.లక్షల్లో అప్పు తీసుకుని ఆ అప్పు తీరే వరకు నిర్వహణ బాధ్యతలు కట్టబెడుతూ దస్తావేజు రాసివ్వడం అభ్యంతరం వ్యక్తమవుతోంది. శుభ, అశుభ కార్యక్రమాలు, సభలు, సమావేశాల నిర్వహణకు కొన్నేళ్ల క్రితం జిల్లా పరిషత్ నిధులు వెచ్చించి బెల్లంపల్లిలో కాంటా చౌరస్తా పక్కన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించారు. కొంత కాలం నిర్వహణ బాధ్యతలు మున్సిపల్ కమిషనర్ కనుసన్నల్లో కొనసాగగా, దళిత సంఘాల నాయకుల వద్ద కూడా తాళాలు ఉండేవి. కార్యక్రమాల నిర్వహణ తగ్గుముఖం పట్టడంతో కొంతకాలంపాటు వృథాగా ఉండిపోయింది. పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి కళావిహీనంగా తయారైంది. కమ్యూనిటీ హాల్‌లో సౌకర్యాల దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు కొందరు ఏకపక్షంగా వ్యవహరించి ఓ వ్యక్తి నుంచి రూ.3లక్షలు అప్పు తీసుకున్నారు. బాత్‌రూంలు, ప్లంబింగ్, కరెంట్ వైరింగ్ తదితర పనులు చేయించారు. బాకీ తీర్చే వరకు నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు రుణదాతకు రూ.100 విలువైన దస్తావేజుపై లిఖిత పూర్వకంగా రాసివ్వడం చర్చనీయాంశమైంది. మూడేళ్లపాటు నిర్వహించుకునే హక్కు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కమ్యూనిటీ హాల్ తాకట్టు పెట్టడంపై మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఒకరిద్దరు కుమ్మక్కై ఈ తతంగం నడిపించారని దళిత నాయకుడు రత్నం ఐలయ్య పేర్కొన్నారు. ఎవరినీ సంప్రదించలేదని తెలిపారు.

అసత్య ఆరోపణలు చేసిన ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఆయన అనుచరుడు జగన్‌మోహన్‌రావుపై అసత్య ఆరోపణలు చేసిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. ఏసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎమ్మెల్యే అండ చూసుకుని జగన్‌మోహన్‌రావు భూ కబ్జాలు, దాడులు, బెదిరింపులకు దిగుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రజనీష్ జైన్, పాత మంచిర్యాలకు చెందిన కొల్లూరి భాస్కర్(డాక్యుమెంట్ రైటర్), సీసీసీ నస్పూర్‌కు చెందిన పెరకొండ్ల సంపత్‌లు ఈనెల 2న మార్కెట్ ఏరియాలో పెన్నుతో రాసిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 4న జగన్‌మోహన్‌రావు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి శనివారం ఉదయం పోలీసులు మఫ్టీలో వారిని అరెస్టు చేశారు. గతంలో రజనీష్ జైన్, భాస్కర్‌పై రెండు భూకబ్జాల కేసులు నమోదయ్యాన్నారు. ఈ కేసుల్లో విచారణకు రాకుండా తప్పించుక తిరుగుతున్నారని డీసీపీ తెలిపారు. కాగా, కరపత్రాలు పంపిణీ చేసే సమయంలో వేసుకున్న డ్రెస్, రాసిన కరపత్రాలు, బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ ప్రకాశ్, సీఐ బన్సిలాల్, ఎస్సై ప్రశాంత్ పాల్గొన్నారు.